

ఇందిరమ్మ ఇళ్లు వెంటనే నిర్మించుకోవాలి

- నాలుగు విడతల్లో రూ.5 లక్షలు వస్తాయి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



చేర్యాలలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులు అందరూ వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బుధవారం కలెక్టర్ మండల కేంద్రమైన కందిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్‌ను పరిశీలించారు. మోడల్ హౌస్ బావుందని అందరు ఇలాగే కట్టుకోవాలని సూచించారు. అనంతరం చేర్యాల గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు నాలుగు విడతల్లో రూ.5 లక్షలు వస్తాయని తెలిపారు. బేస్మెంట్ పూర్తికాగానే రూ.లక్ష, గోడలు పూర్తికాగానే, రూ.లక్ష, స్లాబ్ పూర్తియిన వెంటనేరూ.2 లక్షలు, ఇళ్లు పూర్తి పూర్తికాగనే మరో రూ.లక్ష అందుతాయని కలెక్టర్ వివరించారు. ఆమె వెంట టీపీసీసీ కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రత్యేకాధికారి సల్ల మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కే. సుధీర్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఎస్పీ పంకజ్



సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో ఎస్పీ పంకజ్

సంగారెడ్డి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని పలు ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం సందర్శించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పాటు సెంయిట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల కేంద్రాలను సందర్శించి ఆయా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం సెకండియర్ గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 16727 మందికి 352 మంది గైర్హాజరయ్యారు. 97.90 హాజరు శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

రంజాన్ వేళలు

గురువారం ఇఫ్తార్ : సాయంత్రం 6.31
శుక్రవారం సహర్ : ఉదయం 5.03



గళమెత్తేనా?

ప్రారంభమైన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రశ్నించాల్సిన సమయమిదే..

నిధుల కొరతతో ఆగిన పనులు.. అభివృద్ధి జాప్యం

పెండింగ్‌లోనే కాలువలు, నిర్వాసితుల పరిహారం

నాలుగు డివిజన్ల ఏర్పాటు ప్రశ్నార్థకమేనా

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు తెస్తారా

చక్కెర పరిశ్రమ పునరుద్ధరణ ఇంకెన్నాళ్లకో

గృహ ప్రవేశాలకు 2వేలకుపైగా డబుల్ బెడ్రూం ఇళ్లు

సిద్దిపేట వెటర్నరీ కాలేజీ, వెయ్యి పడకల ఆస్పత్రేది?

అధ్వాన మారిన రహదారులపై ప్రస్తావించేనా?

ఆంధ్రజ్యోతి ఫోకస్



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండోసారి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. 19న బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అయితే, ఈ సమయంలో ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న వారు కాస్త కసరత్తు చేయక తప్పదు. పెండింగ్‌లో ఉన్న పనులు, జరగాల్సిన అభివృద్ధి, సాగు, తాగునీటి అవసరాలు, విద్య, వ్యవసాయ, వాణిజ్య రంగాల ప్రగతి, రహదారులు, పల్లెలు, పట్టణాల దశది శను మార్చే అంశాలపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీలో చర్చించాల్సిన కీలక అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈసారి బడ్జెట్‌పై ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు కోటి ఆశలతో ఉన్నారు. నియోజకవర్గాలలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కారించబడాలంటే నిధుల కేటాయింపులు తప్పనిసరి. మెతుకుసీమ ఆర్థిక, సామాజిక, భౌగోళిక అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే సొమ్ములను సాధించాల్సిందే ఎన్నిక వేళ ఇచ్చిన హామీల అమలుపై, జిల్లాలోని ప్రాజెక్టులకు, అభివృద్ధి పనుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు గళమెత్తుతారని, నిధులు తీసుకొస్తారని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కలగానే కాళేశ్వరం కాలువలు

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ప్రస్తుతం గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ల నుండి చెరువులు, ఆయకట్టు భూముల దాకా కాలువలను నిర్మించాల్సి ఉంది. తద్వారా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలకు నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటివరకు కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయడం లేదు. అదే విధంగా మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఇంకనూ పూర్తి పరిహారం అందలేదు. నిర్వాసిత కాలనీల్లోనూ తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయి. మల్లన్నసాగర్ నుండి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు చేపట్టిన కాలువ పనులను నిలిపివేశారు. దీనిని పునరుద్ధరించాలి.

రెవెన్యూ డివిజన్లపై జాప్యం

సిద్దిపేట జిల్లా చేర్యాల, దుబ్బాక, మెదక్ జిల్లా రామాయంపేట, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మారుస్తామనే హామీలు ఉన్నాయి. చేర్యాలలో నిత్యం ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో అన్ని పార్టీల ముఖ్యనేతలు చేర్యాల గురించి ప్రస్తావించారు. దుబ్బాకది కూడా ఇదే పరిస్థితి. ఇక పటాన్‌చెరు, రామాయంపేటకు సంబంధించి ప్రతిపాదనలు తుదిదశకు చేరాయి. అయినా డివిజన్లుగా ప్రకటించడం లేదనే అభిప్రాయాలు ప్రజల్లో నెలకొన్నాయి.

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు

జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు సాగునీటిని అందించడానికి చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. 30టీఎంసీల సామర్థ్యం కలిగిన సింగూరు రిజర్వాయర్

మిగతా 7వ పేజీలో

పాఠశాలకు టీచర్లు డుమ్మా..

జూకల్ తండా ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుల ఎగనామం

ఆరుబయట ఆడుకున్న విద్యార్థులు



7

పశుగ్రాసం కోసం పరుగులు

యంత్రాలతో పంట కోతతో కొరత

నీటివసతి లేని రైతులు

ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు

వరి గడ్డికి డిమాండ్



7

వేర్వేరు చోట్ల ఐదుగురి మృతి

మల్కాపూర్‌లో కారు టైర్ పగిలి ఒకరు

కొత్తపల్లిలో పాముకాటుతో మరొకరు..

మురుగు కాల్వలో పడి ఇంకొకరు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



6

25శాతం రాయితీ కల్పించిన ముందుకు రావడం లేదు

అమీన్‌పూర్‌లో మొత్తం 17,623 దరఖాస్తులు

ఎల్ఆర్ఎస్‌కు ఎంపికైన 8072 ప్లాట్లు

ఇప్పటి వరకు రుసుము చెల్లించింది 321 మాత్రమే



ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి పవన్

ఎల్ఆర్ఎస్‌కు స్పందన అంతంతే!

పటాన్‌చెరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజ్ స్కీమ్) ఫీజు చెల్లింపుల్లో 25 శాతం మేర తగ్గించినా స్పందన అంతంతమాత్రమే కనబడుతోంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో 17,623 మంది తమ స్థలాలు, ప్లాట్లు క్రమబద్ధీకరించాలని గతంలో వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఇటీవల క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆయా మున్సిపాలిటీలలో టౌన్‌ప్లానింగ్ అధికారులు దరఖాస్తులను పరిశీలించడం ప్రారంభించారు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హత ఉందా లేదా అని నిర్ధారించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఎల్ఆర్ఎస్ లాగిన్ వెబ్‌సైట్లో దరఖాస్తుదారుల ఫోన్‌నెంబర్‌తో యూసర్ ఐడీ ద్వారా వివరాలను తెలియజేస్తున్నారు. మొత్తం మున్సిపాలిటీ పరిధిలో 8,072 దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించేందుకు ఎంపికయ్యాయి. ఇప్పటివరకు కేవలం 321 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్ నగదును చెల్లించి తుది ప్రొసీడింగ్‌లను పొందారు.

ఎందుకు ఇలా?

ఎల్ఆర్ఎస్ రుసుంలో 25శాతం తగ్గించినా ఎందుకు స్పందన కరువైందన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 25శాతం తగ్గించినా రుసుం భారీగా ఉండటంతో వెనకంజ వేస్తున్నారు. ఇల్లు నిర్మించే సమయంలో క్రమబద్ధీకరణ రుసుం చెల్లిస్తే సరిపోతుందని కొందరు భావిస్తున్నారు. భవిష్యత్తులో మరింత తగ్గించే అవకాశం ఉందన్న ప్రచారం నడుస్తోంది. కొంతమంది ప్లాట్ల యజమానులు స్థలాలను అమ్ముకోవడంతో కొన్నవారి ఫోన్ నంబర్లు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులో లేకపోవడం ఓ కారణంగా భావిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

ఎల్ఆర్ఎస్‌పై మరింత అవగాహన కల్పిస్తున్నాం. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం. ఎల్ఆర్ఎస్ పొందడం ద్వారా ఇళ్ల నిర్మాణానికి సులభంగా అనుమతులు పొందడం, బ్యాంకుల్లో రుణాలు, రిజిస్ట్రేషన్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసుకోవచ్చు. అనేక ప్రయోజనాలు ముడిపడి ఉన్నందున ఎల్ఆర్ఎస్ తుది ప్రొసీడింగ్ పొందాలని సూచిస్తున్నాం. దరఖాస్తు చేసి ఫోన్ నంబర్లు లేనివారు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వస్తే కొత్త ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేస్తాం. ఎల్ఆర్ఎస్ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లిస్తే నాలుగైదు రోజుల్లో ప్రొసీడింగ్ పొందవచ్చు.

- పవన్, అమీన్‌పూర్ టౌన్ ప్లానింగ్ అధికారి

పాత తేదీలతో సంతకాలతో అనుమతి

రామచంద్రాపురం టౌన్ మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీగా మారితే సవాలక్ష నిబంధనలు విధిస్తారన్న ప్రచారంతో అనుమతుల పేరిట దందాకు తెరలేపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీ విలీన గ్రామాలైన పాటి, ముత్తంగి, కర్దనూరు, ఘన్‌పూర్ గ్రామాల్లో పనిచేసి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు పాత తేదీలతో సంతకాలతో చేసి ఇంటి అనుమతి పత్రాలు ఇస్తూ లక్షలు వసూలు చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లో సైతం ఇంటి అనుమతులు మంజూరు చేశారు. ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు.

క్యూఆర్ కోడ్‌తో ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లింపు

మెదక్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : స్థలాల క్రమబద్ధీకరణ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించేందుకు 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు. మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. 2020 ఆగస్టు 26 వరకు రిజిస్ట్రేషన్ డ్యాక్యుమెంట్ ఫీజు రూ.1000 చెల్లించిన వారికి ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించే వెసులుబాటును కల్పించింది.

చెల్లింపు ఇలా..

ఎల్ఆర్ఎస్ రుసుం క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించవచ్చు. ముందుగా కోడ్ లింక్ ఓపెన్ చేయాలి. ఆతర్వాత లబ్ధిదారుడి ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీని ఓకే చేయగానే ఫీజు వివరాలు కనబడతాయి. ఈ లింకు ద్వారా నెట్ బ్యాంకింగ్, ఈ - పేమెంట్లు, గూగుల్ పే, ఫోన్ పే, యూపీఐ పేమెంట్ లేదా ఆర్టీజీఎస్ ద్వారా 25 శాతం మినహాయింపు పోనూ మిగతా రుసుం చెల్లించే వెసులుబాటును కల్పించారు ప్లాట్ ఏరియాను బట్టి ఒక్కో రేటు నిర్ణయించారు. కమర్షియల్, రెసిడెన్షియల్, ఇలా ప్రాంతాలను జోన్‌ల వారీగా విభజించారు.

మెదక్ జిల్లాలో

గతంలో ఎల్ఆర్ఎస్ కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మొత్తంగా 14,756 దరఖాస్తులు వచ్చాయి. మెదక్‌లో 3802, నర్సాపూర్‌లో 1941, తూప్రాన్‌లో 6536, రామాయంపేటలో 2477 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఫీజు పరిధిలోకి ఎన్ని వస్తాయనే దానిపై టౌన్ ప్లానింగ్ అధికారులు లెక్కలు తీశారు. ఈ దరఖాస్తులకు మోక్షం కల్పించడానికి అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి టౌన్ ప్లానింగ్ విభాగం రీజనల్ డైరెక్టర్‌కు అనుమతి కోసం పంపించారు. లేఅవుట్‌లలోనూ ప్లాట్ల ఎల్ఆర్ఎస్‌కు అనుమతి కల్పించింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధీనంలో ఉన్న ఎల్ఆర్ఎస్ పోర్టల్‌ను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానించారు. అయితే, నీటి వనరులు, జలాశయాలకు 200 మీటర్ల పరిధిలో (బఫర్‌జోన్)లో ఉండే సర్వే నంబర్ల వివరాలు ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించారు.

తాగి నడిపితే..

కటకటాలే

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఆరుబయట మద్యం తాగేవారిపైనా ప్రత్యేక దృష్టి

కోర్టుల్లో హాజరుపరుస్తూ.. జైలుశిక్ష, జరిమానా విధింపు

మరోవైపు అవగాహన సదస్సులతో చైతన్యం



మెదక్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. రహదారి ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో భాగంగా ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్న మెదక్ జిల్లా పోలీసు యంత్రాంగం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను సమర్థవంతంగా వినియోగించుకుంటోంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు, జైలుశిక్ష పడినవారు

సంవత్సరం	కేసులు	జైలుశిక్ష
2023	4740	10
2024	6563	11

2025 మార్చి9 వరకు 2716 కేసులు కాగా, 582 మందికి జరిమానాలు విధించారు

ఆన్‌లైన్ ద్వారానే

వాహనాల తనిఖీల సమయంలో బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తారు. పట్టుబడిన వెంటనే వాహనం రిజిస్ట్రేషన్ నంబర్లు బ్రీత్ అనలైజర్‌లో చూపించిన ఆల్కహాల్ శాతం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేసు నమోదు చేస్తున్నారు. బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కన్సంట్రేషన్) ప్రమాణాల మేరకు ప్రతీ వంద మిల్లీలీటర్ల రక్తంలో 30 మిల్లీ గ్రాములకు మించి మద్యం మోతాదు మించకూడదు. బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో 30 దాటిన వారిపై కేసు నమోదు చేస్తారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి.. మద్యం తాగిన వాహనదారులను వారి గమ్యస్థానాలకు పంపించి వేస్తారు. చార్జీషీట్ నమోదు చేసి కేసును న్యాయస్థానానికి పంపిస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేలపై వరకు జరిమానాతో పాటు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది.

అవగాహన సదస్సులు

మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. కొన్నిరోజులుగా సాగుతున్న ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, వాటిని అతిక్రమిస్తే జరిగే అనర్థాలపై చైతన్యం కల్పిస్తున్నారు. మరోవైపు మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తూ న్యాయస్థానాలకు పంపుతున్నారు. జైలుశిక్ష, జరిమానా వంటి చర్యలతో ఇటీవల కేసులు నమోదు గణనీయంగా తగ్గిందని చెప్పవచ్చు. ఆరుబయట, ఖాళీ స్థలాల్లోనూ మద్యం సిట్టింగ్ వేయొద్దని హెచ్చరిస్తున్నారు.

సింగూరు పంచాయతీ కార్యదర్శిపై డీఎల్పీవో విచారణ

● జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక



డీఎల్పీవో అనితకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

పుల్‌కల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగూరు గ్రామపంచాయతీ కార్యదర్శి రంగయ్య అవినీతి, అక్రమాలపై డీఎల్పీవో అనిత బుధవారం విచారణ జరిపారు. పంచాయతీకి రావాల్సిన నిధులను దుర్వినియోగం చేయడమే కాకుండా, ప్రజల వద్ద వసూలు చేసి పన్ను డబ్బులను సైతం సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపిస్తూ ఈ నెల 10న పుల్కల్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదుపై ఎంపీడీవో ఆనందమేరీ, ఎంపీవో శ్రీకాంత్ జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక పంపారు. సంగారెడ్డి డివిజనల్ పంచాయతీ అధికారి అనిత(డీఎల్పీవో) ఎంపీవో శ్రీకాంత్‌తో కలిసి సింగూరు గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. ఇంటి నిర్మాణ అనుమతికి డబ్బులు వసూలు చేయడమే కాకుండా, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు రూ.5 వేల చొప్పున డిమాండ్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ డీఎల్పీవో ఫిర్యాదు చేశారు. 90 గజాల ఇంటి నిర్మాణానికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని ప్రజలు గగ్గోలు పెట్టారు. డీఎల్పీవో అనిత స్పందిస్తూ ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారికి సమగ్రమైన నివేదిక అందజేసి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. గ్రామస్థులు రాతపూర్వకంగా మరోమారు డీఎల్పీవోకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.

తపాలాశాఖ ఉత్తరాల రచన పోటీల్లో జాతీయస్థాయి బహుమతి



రాజేశ్వర్

తూప్రాన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్‌కు చెందిన వజ్జ రాజేశ్వర్ భారత తపాలాశాఖ నిర్వహించిన ఉత్తరాల రచన పోటీల్లో జాతీయస్థాయి (తెలంగాణ సర్కిల్) తృతీయ బహుమతి లభించింది. తూప్రాన్ గీతా స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజేశ్వర్ గత యేడాది డిసెంబరులో డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాముఖ్యత అనే అంశంపై తపాలాశాఖ లేఖ రచన పోటీలు నిర్వహించింది. జాతీయస్థాయి తృతీయ బహుమతి పొందిన రాజేశ్వర్‌కు రూ.5 వేల నగదు, కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ నుంచి ధ్రువపత్రం అందజేశారు. జాతీయస్థాయి తృతీయ బహుమతి పొందిన రాజేశ్వర్‌ను పాఠశాల కరెస్పాండెంట్ పీ.రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



మహమ్మద్ మెహ్రాజ్(ఫైల్)



ఆంజనేయులుగౌడ్(ఫైల్)



అవుసుల రాములు(ఫైల్)

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందిన సంఘటన మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం చోటు చేసుకున్నది.

కొండాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కారు టైర్ పగిలి ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. హైదరాబాద్, కూకట్‌పల్లి ఎల్లమ్మబండకు చెందిన మహమ్మద్ మెహ్రాజ్(27) స్నేహితులు సలీం, ఇర్ఫాన్, గేరే మియా, అఖిల్‌తో కలిసి వ్యాపారం పనిలో భాగంగా కారులో సంగారెడ్డి జిల్లా కోహీర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో అర్ధరాత్రి సమయంలో కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారు రహదారి అండర్‌పాస్ బ్రిడ్జి పైకి రాగానే కారు ముందు టైరు పగిలి బోల్తాపడి డివైడర్‌ను ఢీకొట్టింది. కారు నడుపుతున్న మహమ్మద్ మెహ్రాజ్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న స్నేహితులకు గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మృతుడి సోదరుడు ఫెరోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి..

పాపన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన వంగపాటి నాగరాజు(53) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుడప్పుడు ఎక్కడైనా పాములు వస్తే వాటిని పట్టేవాడు. మంగళవారం సాయంత్రం కొత్తపల్లి గ్రామంలోని అనంత పద్మనాభస్వామి ఫంక్షన్‌హాల్‌లోకి పాము వచ్చింది. అక్కడికి వెళ్లి పామును పట్టే క్రమంలో నాగరాజును అది కరిచింది. అక్కడే ఉన్నవారు వెంటనే మెదక్ జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మురుగు కాలువలో పడి..

సంగారెడ్డి క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కాలకృత్యాల కోసం వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మురుగుకాలువలో పడి మృతిచెందాడు. పట్టణ సీఐ రమేష్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని సాయినగర్ కాలనీలో నివాసముంటున్న దానయ్యల ఆంజనేయులు గౌడ్(48) కూలీ పనిచేస్తూ జీవించేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈనెల 10న కూలీ పనులకు సంబంధించి డబ్బులు తెచ్చుకుంటానని ఆంజనేయులుగౌడ్ ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అదే రోజు మద్యం తాగి కలెక్టరేట్ పక్కన ఉన్న శారద ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఉన్న పెద్ద మురుగు కాలువలో పడి మృతిచెందాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ..

కల్హేర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వచ్చి కిందపడిపోయిన వ్యక్తికి తీవ్రగాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బల్కం చెల్కా తండాకు చెందిన ఆత్‌లోత్ హరిసింగ్(59)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. సోమవారం మూర్ఛతో ముందు పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య రంకిబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో

పాపన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం కొత్తపల్లికి చెందిన అవుసుల రాములు(40) గోల్డ్‌స్మిత్‌గా పనిచేసేవాడు. కొన్నినెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. నెలక్రితం భార్య సరళ పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రాములు దిగాలుగా ఉండేవాడు. బుధవారం ఉదయం గ్రామ ప్రధాన రోడ్డు పక్కన విషం తాగి పడి ఉన్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. రాములు మృతిచెంది ఉన్నాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఖాదీరాబాద్‌లో మహిళ హత్య

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పారితోష్ పంకజ్



ఘటనా స్థలం వద్ద ఎస్పీ పారితోష్ పంకజ్



గౌరమ్మ(ఫైల్)

వట్‌పల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి ఓ మహిళ హత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం ఖాదీరాబాద్‌లో బుధవారం జరిగింది. వట్‌పల్లి ఏఎస్‌ఐ సుధాకర్, గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఖాదీరాబాద్ గ్రామానికి చెందిన కొట్టె గౌరమ్మ(45) భర్త మృతిచెందడంతో ఒంటరిగా నివసిస్తోంది. బుధవారం ఉదయం ఆమె ఇంట్లోనుంచి పొగలు రావడాన్ని ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మంచం పూర్తిగా దగ్ధమై ఉండగా, కొట్టె గౌరమ్మ విగతజీవిగా కనిపించింది. ఈవిషయాన్ని ఏఎస్‌ఐ సుధాకర్ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఎస్పీ పారితోష్ పంకజ్, డీఎస్పీ సత్యయ్యగౌడ్ ఖాదీరాబాద్‌కు చేరుకుని పరిశీలించారు. వీరి ఆదేశాల మేరకు క్లూస్‌టీం, జాగిలాలతో విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు తన అక్కపై దాడిచేసి, నగలు దొంగిలించి హత్య చేసినట్లు తమ్ముడు వీరేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఇస్నాపూర్లో రియల్ వివాదం, స్వల్ప ఉద్రిక్తత

పటాన్‌చెరు రూరల్, మార్చి (ఆంధ్రజ్యోతి) : ఇస్నాపూర్‌లో ఓ వెంచర్ యాజమాన్యానికి ప్లాట్ల యజమానులకు జరిగిన వివాదం ఉద్రిక్తతకు దారితీసి, స్వల్ప లాఠీచార్జ్ జరిగింది. బీడీఎల్, ఓడీఎఫ్ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. 430 మంది బీడీఎల్, ఓడీఎఫ్ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడ్డారు. ఇస్నాపూర్ పంచాయతీ పరిధిలో లక్డారం గేటు వద్ద 160 నుంచి 175, 196, 201 సర్వే నెంబర్లలో దాదాపు 40 ఎకరాల్లో గతంలో ఓ ప్రైవేట్ పరిశ్రమ ఉండేది. ఫైల్ స్టోన్ డెవలపర్స్ ఈ భూమిని అభివృద్ధి చేసి జీఎంఆర్ వెంచర్ ఏర్పాటు చేయడంతో 430 మంది ఓడీఎఫ్ బీడీఎల్ ఉద్యోగులు ఈ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేశారు. వెంచర్ యజమాని నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి తమకు విక్రయించిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం లేదని గతంలో బీడీఎల్, ఓడీఎఫ్ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. అనంతరం 390 మందికి అంచలంచెలుగా రిజిస్ట్రేషన్ చేసిన యాజమాన్యం 40 మందికి మాత్రం రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో బీడీఎల్, ఓడీఎఫ్ ఉద్యోగులు బుధవారం ప్లాట్ల కబ్జాలోకి వెళ్లడంతో, వెంచర్ యాజమాన్యం బౌన్సర్లను రంగంలోకి దించింది. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్వల్ప లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి వచ్చింది. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఇప్పటికే యాజమాన్యానికి రూ.38 కోట్లు చెల్లించామన్నారు. జాతీయ రహదారి పక్కన వచ్చిన 40 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతుందని చెప్పారు. తాము ప్లాట్లలోకి వస్తే యాజమాన్యం తీసుకొచ్చిన బౌన్సర్లు తమపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.

గుమ్మడిదల రైతు సంఘం పనితీరు బేష్

గుమ్మడిదల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రైతులు సమష్టి కృషితో పంటలు సాగు చేయడం హర్షణీయమని ఇజ్రాయిల్ దేశానికి చెందిన శాస్త్రవేత్తలు అభినందించారు. మండల కేంద్రంలోని మంబాపూర్ హనీఫ్ అనే రైతు పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వారు రైతు సంఘం ఎలా ఏర్పాటు చేసుకున్నారు. ఏ విధంగా నడిపిస్తున్నారు అన్న విషయాలను రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం మాజీ అధ్యక్షుడు పోసుగారి మోహన్‌రెడ్డి, రాములు గౌడ్, రంగారెడ్డి, హనీఫ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

హోలీ ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. సురక్షితమైన సహజ రంగులను వాడి వేడుకలు జరుపుకోవాలన్నారు. పండుగ అనంతరం చెరువుల్లో, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. యువత తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలన్నారు. వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, ర్యాష్‌డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ వంటివి మానుకోవాలని సూచించారు.

పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈవో

చేర్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలంలోని కడవేరుగు జడ్పీఎస్ఎస్‌ను బుధవారం సిద్దిపేట జిల్లా పరిషత్ సీఈవో సి.రమేశ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విద్యాబోధన తీరు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భోజనశాల, టాయిలెట్ నిర్మాణ పనుల పూర్తికి నిధులు విడుదల చేయాలని హెచ్ఎం చంద్రశేఖర్ ఆయనను కోరారు.

రైతులు ఆధునిక సాగుకు సిద్ధం కావాలి

● మెదక్ జిల్లా వ్యవసాయాధికారి వినయ్

పాపన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆధునిక సాగుకు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పాపన్నపేట, చిత్రియాల్ డీసీఎంఎస్ ఎరువుల దుకాణాలను, రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. అవసరానికనుగుణంగా, వ్యవసాయ అధికారుల సలహా మేరకు ఎరువులు వాడాలని చెప్పారు. ఎరువుల దుకాణాదారులు నాణ్యమైన ఎరువులను విక్రయించాలని సూచించారు. నిబంధనల కనుగుణంగా వ్యాపారం చేయాలన్నారు. రైతులకు ఏ సమస్యలు వచ్చినా, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఆయన వెంట పాపన్నపేట మండల వ్యవసాయ అధికారి నాగమాధురి ఉన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ

దౌల్తాబాద్,మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముబ్బారాస్‌పూర్ జడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు రణం సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బండారు దేవేందర్, బోటుక తిరుపతి, మాజీ సర్పంచ్‌లు యాదగిరి, యాదవరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిలుక వైకుంఠం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత జయమ్మకు సన్మానం



జయమ్మను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జగదేవ్‌పూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆదర్శ మహిళా అవార్డును అందుకున్న కొన్నె జయమ్మను బుధవారం జగదేవ్‌పూర్‌లో బీఆర్ఎస్ మర్కుక్ మండల బీసీసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాజు, కరుణాకర్, బాలకిషన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాడ కోసం

బోర్ల మీద బోర్లు..

పంటలను కాపాడుకునేందుకు భగీరథ యత్నం

కాలిపోతున్న బోరు మోటార్లు.. దయనీయ స్థితిలో అన్నదాతలు



చేర్యాల శివారులో వేస్తున్న బోరు

చేర్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సాగు నీరు అందక, భూగర్భ జల మట్టాలు అడుగంటుతుండటంతో రైతుల పరిస్థితి దిక్కుతోచకుంది. మరికొన్ని రోజుల్లో పంట చేతికి రానుండటంతో కొందరు బోర్ల మీద బోర్లు వేస్తున్నారు. గంటల తరబడి బోర్లు నడిపిస్తుండటంతో మోటార్లు కాలిపోతున్నాయి. చేర్యాల ప్రాంతంలో భూగర్భజలాల నీటిమట్టం అడుగంటడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మరికొద్దిరోజుల్లో చేతికందే దశలో ఉన్న పంటకు నీరందక, కళ్ల ముందే ఎండిపోతుండటంతో భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థికస్థోమత లేని రైతులు చేసేదేమీలేక కన్నీటి పర్యంతమవుతూ పశువులకు గ్రాసంగా వదిలిపెడుతుండగా, మరికొందరు గంగమ్మ జాడకోసం కొత్తగా బోర్లు వేస్తున్నారు. దీంతో గ్రామాలలో ఎక్కడ చూసినా బోరు బండ్ల చప్పుడే వినిపిస్తోంది. చేర్యాల పట్టణ శివారులోని బండపల్లి కాలనీలో ఇటీవలి కాలంలో రైతులు 30 బోర్లకు పైగా వేశారు. చుంచనకోట, ఆకునూరు, పెద్దరాజు పేట, కొమురవెల్లి, తదితర గ్రామాలలో ఒక్కో రైతు రెండు, మూడేసి బోర్లు వేస్తున్నారు. దీంతో బోర్‌వెల్ బండ్లకు డిమాండ్ పెరిగింది. కొత్తగా బోర్లు వేస్తుండటంతో పైపులు, ఇతరత్రా సామగ్రి కొనుగోళ్లు పెరడంతో ఎలక్ట్రికల్ దుకాణాలు కళకళలాడుతున్నాయి.

రిపేర్లకు తంటాలు

పంటకు సాగునీటి కోసం బోర్లు నడుపుతుండటంతో మోటార్లు కాలిపోతున్నాయి. ఈ క్రమంలో రిపేర్ దుకాణాలలో మోటార్ల రద్దీ పెరిగింది. దీంతో రాత్రివేళల్లోనూ రిపేర్ చేయించుకునేందుకు పడిగాపులు కాస్తున్నారు. ఒక్కసారి బోరుమోటార్ కాలిపోతే భూమిలోనుండి వెలికితీసి, రిపేర్ చేయించిన తరువాత బిగించినప్పుడల్లా రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. విద్యుత్ సరఫరాలోనూ గంట పాటు కోత పెట్టడంతో వచ్చే కొద్దిపాటి నీటిని సైతం వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కోల్పోయిన పంటలకు పరిహారం అందించడంతో పాటు చివరి దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి చెరువులు, కుంటలకు మళ్లించాలని రైతులు కోరుతున్నారు.



చేర్యాలలోని ఓ మెకానిక్ షాప్‌లో రాత్రివేళ బోరు రిపేరుచేయించుకుంటున్న రైతులు

వారంలో మూడు బోర్లు వేశాను



ఐదు ఎకరాల్లో వరి వేశాను. గతంలో 19 బోర్లు వేశాను. ఇప్పుడు భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నీరందడం లేదు. పంటను కాపాడుకునేందుకు వారంలో మూడు బోర్లు వేశాను. రెండింటిలో నీరు రాలేదు. ఒక్క బోరులో కొన్ని నీళ్లు పడ్డాయి. చెరువులు నింపితే కొంతైనా పంటను కాపాడుకోవచ్చు.

-బ్రాహ్మండ్లపల్లి యాదగిరి, రైతు

మోటార్ రిపేర్‌కు రూ. 7 వేల నుంచి రూ. 10 వేల ఖర్చు



మూడెకరాల భూమిలో వరి సాగు చేశాను. భూమిలో నీరు లేక బోరు మోటారు కాలిపోయింది. కొత్తగా బోరు వేద్దామంటే సుమారు లక్ష వరకు ఖర్చు అవుతుంది. ఒక్కసారి మోటారు కాలిపోతే రిపేరు చేయిస్తే రూ.7 వేల నుంచి రూ. 10 వేలు ఖర్చు అవుతున్నాయి. కరెంటు కూడా గంట సమయం తక్కువగా వస్తుంది. ఏం చేసినా రైతును పట్టించుకున్న వారు లేరు.

శీర్ల నర్సింహులు, రైతు, చుంచనకోట

గిరాకీ కాస్త పెరిగింది

రైతుల బోరుమోటార్లు కాలిపోవడంతో పాటు కొత్తగా బోర్లు వేస్తుండటంతో ఆయా సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. సాధారణ రోజులలో కన్నా గిరాకీ కాస్త పెరిగింది. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడు లేదు. రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో చెప్పలేం.

వీరేశం, వ్యాపారి

ఆరు బావులున్నా.. తడవని నేల



ఆరు బోరు బావులు ఉన్నా ఎండుతున్న వరి

కల్హేర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆ రైతు తనకున్న 28 గుంటల భూమిలో ఆరు బోర్లు వేశాడు. భూగర్భ జలాలు అడుగంటి సాగుకు నీరందక పంట ఎండిపోతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచకున్నాడు. మండల కేంద్రమైన కల్హేర్‌కు చెందిన రైతు గంగారాం తనకున్న 28 గుంటల భూమిలో గతంలో మూడు బోర్లు వేశాడు. తన భూమితో పాటు మరికొందరి భూములు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. యాసంగిలో తన 28 గుంటల్లో వరి వేయగా, పొట్ట దశకు రాగానే మూడు బోర్లలో నీరు అడుగంటింది. పంటను కాపాడుకునేందుకు మర బోరు వేయించాడు. అయినా, నీరు పడలేదు. దీంతో మరో రెండు బోర్లు వేశాడు. అందులో కూడా చుక్క నీరు పడకపోవడంతో పంటను కాపాడుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఒక్క రైతే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వందలాది బోర్లు తవ్వి అప్పుల పాలవుతున్నారు.

పశుగ్రాసం కోసం పరుగులు



ఎడ్ల బండిపై తీసకొస్తున్న పశుగ్రాసం

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతుండగా, ఈసారి ప్రారంభంలోనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతోపాటు పశుగ్రాసం కొరత కూడా వచ్చింది. ఇటీవల వరకు రైతులు సాంప్రదాయ పంటలైన జొన్న అధికంగా సాగు చేసేవారు. వరి సాగు చేసే రైతులు పంటను కూలీలతో కోయించే వారు. ప్రస్తుతం జొన్న సాగు కనుమరుగైంది. వరి సాగు చేసిన రైతులు పంటను యంత్రాల ద్వారా కోయిస్తుండటంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది.

సంగారెడ్డి జిల్లాలో పశుసంపద	
ఆవులు, ఎద్దులు	1,53,829
గేదెలు	1,65,273
మేకలు	4,38,757
గొర్రెలు	2,29,029

వరి గడ్డికి డిమాండ్

పశువులను రక్షించుకోవడానికి నీటి వసతి ఉన్న రైతులు పశుగ్రాసాన్ని ప్రత్యేకంగా సాగు చేసి పోషించుకుంటుండగా, నీటివసతి లేని రైతులు ఇతర ప్రాంతాల నుంచి వరి గడ్డిని, చొప్ప బెండులను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. దీంతో వరి గడ్డికి డిమాండ్ ఏర్పడింది. మొన్నటి వరకు వరిగడ్డి మోపు రూ.30 నుంచి 40 వరకు లభించేదని, ప్రస్తుతం రూ. వంద నుంచి రూ. 150 వరకు లభిస్తుందని పశుపోషకులు అంటున్నారు. చొప్ప ఒక బండి ఇటీవలి వరకు రూ.1000 వరకు లభించగా, ప్రస్తుతం రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని పశుపోషకులు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై తెచ్చుకుంటున్నారు.

పశుగ్రాసం కొరత లేదు



జిల్లాలో పశుగ్రాసం కొరత లేదు. భూములు లేని వారు పశువులను పెంచుతుండడంతో వారు కొనుగోలు వరి గడ్డి కొనుగోలు చేస్తున్నారు. భూములు ఉన్న వారు పశుగ్రాసం పెంచుకుంటున్నారు. పశువులు పోషించుకునే వారు ఎంతో కొంత భూమి కొనుగోలు చేసి, గ్రాసం పెంచుకోవాలి. నీటి సమస్య ఉత్పన్నమైతే, జిల్లా వ్యాప్తంగా 330 పశువుల నీటి తొట్లు ఉన్నాయి. వాటిలో నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే మరిన్ని నీటి తొట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తాం.

వసంతకుమారి, జేడీ, పశు సంవర్ధక శాఖ

చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

సంగారెడ్డి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెస్లీ పాఠశాల తీరుపై జడ్జి ఆగ్రహం

పరిసరాలు అధ్వాన్నంగా ఉన్నాయని మండిపాటు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

మెదక్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రంగా మూత్రశాలలు, అధ్వాన్నంగా మరుగుదొడ్లు.. దుర్గంధభరితంగా పరిసరాలు ఉండటంపై వెస్లీ పాఠశాల హెచ్‌ఎం ప్రీతిపై సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పిల్లల న్యాయ సేవ విభాగ కార్యకలాపాలల్లో భాగంగా బుధవార పాఠశాలలను ఆయన ఎంఈవో నీలకంఠంతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. అపరిశుభ్రంగా, తలుపులేని మరుగుదొడ్లను చూసి అవాక్కయ్యారు. జిల్లా కేంద్రంలో ఇంత దారుణంగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించారు. ఎక్కడా చూసిన చెత్తచెదారంతో నిండి ఉండడం చూసి బాలల హక్కుల ఉల్లంఘన అని, బాలికల గౌరవభంగంగా దానిని పేర్కొంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాలకు టీచర్లు డుమ్మా..

ఆరుబయట ఆడుకున్న విద్యార్థులు



ఆడుకుంటున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో ఖాళీగా తరగతి గది)

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఇష్టానుసారంగా విధులకు ఎగనామం పెడుతుండడంతో విద్యార్థులకు చదువులు చెప్పేవారు లేకుండా పోయారు. విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేక పోవడంతో పరిస్థితి మరింత దిగజారుతుంది. నారాయణఖేడ్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో, ఎంపీడీవో కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జూకల్ తండా ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు బుధవారం చెప్పా పెట్టకుండా వెళ్లి పోయారు. ఈ పాఠశాలలో 30 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇద్దరు ఉపాధ్యాయులు పాఠశాలలో లేరు. దీంతో విద్యార్థులు ఆరు బయట, రోడ్డు వెంట ఆడుతూ కన్పించారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ టీచర్ సాంకిబాయి మాట్లాడుతూ తనను పాఠశాల వైపు చూడండి అని చెప్పి తలనొప్పి వచ్చిందని, ఉపాధ్యాయులు వెళ్లి పోయారని తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఒకే మారు వెళ్లి పోవడంతో, రహదారి పక్కనే పాఠశాల ఉండడం, చిన్న పిల్లలు రోడ్డు సమీపంలో ఆడుతుండడంతో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని డీఈవో వెంకటేశ్వర్లు వద్ద ప్రస్తావించగా, ఎంఈవోను పంపించి విచారిస్తానని చెప్పారు.

పరీక్ష రాస్తుండగా ఇంటర్ విద్యార్థినికి అస్వస్థత

ఆస్పత్రికి తరలింపు..

పరీక్ష రాయలేకపోయానని ఆవేదన

జహీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరీక్ష రాస్తూ విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తపస్య జూనియర్ కళాశాలలో బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మొగుడంపల్లి మండలానికి చెందిన సుజాత పట్టణంలోని తపస్య కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చింది. పరీక్షలు రాస్తున్న క్రమంలో స్వల్ప అస్వస్థతకు గురైంది. పరీక్షల ఇన్విజిలేటర్‌కు తెలియజేయడంతో ఆమెను వెంటనే పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కొన్నిగంటల తర్వాత కోలుకున్నది. అనంతరం పరీక్షను రాయలేకపోయానని విద్యార్థిని విచారం వ్యక్తంచేసింది.

గ్రూప్-2 మహిళల విభాగంలో రెండో స్థానం



సుస్మిత

పాపన్నపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అబ్లాపూర్ గ్రామానికి చెందిన బాయికాడి సుస్మిత గ్రూప్- 2లో మహిళల విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అమ్మాయిల విభాగంలో రాష్ట్రస్థాయిలో 406 మార్కులు సాధించిన సుస్మిత రెండో స్థానాన్ని సాధించారు. ఆమె ప్రస్తుతం కొల్చారం గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. గ్రూప్ 1లో కూడా 401 మార్కు లు సంపాదించారు. ఆమె భర్త శ్రీనివాస్ గౌడ్ మండల పరిధిలోని జయపురంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. భర్త ప్రోత్సాహంతోనే విజయం సాధించగలిగానని సుస్మిత అన్నారు.

అసెంబ్లీలో గళమెత్తేనా?

5వ పేజీ తరువాయి

తలాపునే ఉన్నప్పటికీ సంగారెడ్డి జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రాజెక్టులను నిర్మిస్తే దాదాపు 4లక్షల ఎకరాలకు సాగు నీరు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా సింగూరుకు గోదావరి జలాలను తరలించాలి. ఇక్కడి నుంచి బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులకు నీటిని పంపిస్తారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయి.

ఈ సమస్యలపై దృష్టిపెట్టాల్సిందే

- జహీరాబాద్ ప్రాంతంలో ట్రైడెంట్ చక్కెర పరిశ్రమను పునరుద్ధరించాలనే డిమాండ్ ఉంది. పరిశ్రమ లేకపోవడంతో ప్రతీ ఏటా 16లక్షల మెట్రిక్ టన్నుల చెరుకును కర్నాటక, మహారాష్ట్రలకు తరలిస్తున్నారు.
- గౌరవెల్లి రిజర్వాయర్ నుంచి నీరందించడానికి కాలువల నిర్మాణం చేపట్టాలి. ముంపు బాధితుల సమస్యలూ ఉన్నాయి.
- కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని రాజీవ్‌రహదారి నుంచి హుస్నాబాద్‌కు, హుస్నాబాద్ నుంచి జనగామ వరకు ఫోర్‌లైన్ నిర్మించాల్సి ఉంది. నిధులు లేక పనులు జరగడం లేదు.
- నర్సాపూర్‌లో సమీకృత మార్కెట్, మున్సిపల్ భవనం, డంపు యార్డు నిధుల్లేక నిలిచిపోయాయి. ఇక డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయక నిరుపయోగంగా మారాయి.
- డివిజన్ కేంద్రంగా ఉన్న నర్సాపూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సొంత భవనాలు లేవు.
- జహీరాబాద్ ప్రాంతంలోని నారింజవాగును మినీట్యాంకు బండ్‌గా మార్చాలనే ప్రతిపాదన ఉంది.
- జహీరాబాద్ పట్టణంలోని హోతి(కే) శివారులో నిర్మించిన 660 డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయింపులో జాప్యం చేస్తున్నారు.
- నారాయణఖేడ్‌లో వలసల నివారణకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నిర్మాణానికి హామీలు ఇచ్చారు. ఇక్కడ పీజీ, మహిళా, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలి.
- నారాయణఖేడ్‌లో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు అత్యవసరం.
- గుమ్మడిదల డంపు యార్డు సమస్య ప్రధానంగా ఉంది. ఇక్కడ డంపు యార్డు ఏర్పాటు చేయవద్దని ప్రజలు నిత్యం ఆందోళనలు చేస్తున్నారు.
- అల్లాదుర్గం నుంచి మెటల్‌కుంట వరకు ఉన్న రహదారి గుంతలు పడి ధ్వంసమైంది. కర్నాటక, మహారాష్ట్రలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారిని తక్షణమే మరమ్మతులు చేయాలి.
- సిద్దిపేటలో వెటర్నరీ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలి. 90శాతం పూర్తయిన ప్రభుత్వ మెడికల్ కళాశాల వెయ్యి పడకల ఆసుపత్రిని ఇంకా అందుబాటులోకి తేవడం లేదు. రంగనాయక సాగర్, కోమటిచెరువు టూరిజం పనులు నిధుల్లేక నిలిచిపోయాయి.
- దుబ్బాకలోని ప్రధానమైన రహదారులు గుంతల మయంగా మారాయి. ఇందుకోసం రూ.1200కోట్లతో ప్రతిపాదనలు పంపించగా మోక్షం లేదు.
- సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలకు రూ.50కోట్ల చొప్పున నిధులు ప్రకటించి రద్దు చేశారు. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.
- మెదక్ పట్టణానికి బైపాస్‌రోడ్డు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంది. మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి.
- మెదక్‌లో ఇంటిగ్రేటెడ్ షాపింగ్ కాంప్లెక్ పనులు జాప్యమవుతున్నాయి.

న్యూస్ బాక్స్

14న త్రిశూలం ప్రాణ ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలం శివారు సందుతండాలోని దక్షిణా కాళికామాత ఆలయంలో 14న హోళీ పండుగలో భాగంగా 250 టన్నుల యంత్ర తంత్ర త్రిశూలం ప్రాణప్రతిష్ఠ, 121 మంది కన్యలతో అభిషేకం, 121 హోమాలతో, 11,111 మంది మహిళలతో పూజ, కాలకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు బుధవారం తెలిపారు. ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్‌మహరాజ్ ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

17న తైబజార్ వేలం

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఈనెల 17న మధ్యాహ్నం 2.30 గంటలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి తైబజార్, మేకల బజార్, ఎడ్లబజార్, పెద్దమాంసం, చిన్నమాంసంలకు సంబంధించిన వేలంపాటలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 12 నుంచి 16 సాయంత్రం 5 గంటలలోపు వేలం నిబంధనల ప్రకారం తైబజార్‌కు రూ.10 లక్షలు, మేకల బజార్‌కు రూ.5 లక్షలు, ఎడ్ల బజార్‌కు రూ.2 లక్షలు, పెద్దమాంసం, చిన్న మాంసాలకు సంబంధించి రూ.లక్ష చొప్పున డిపాజిట్ చేసి రశీదు, లేదా ఏదైనా జాతీయ బ్యాంకు డీడీని మున్సిపల్ కమిషనర్ పేరిట తీసి కార్యాలయంలో అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రేగోడు మీదుగా దత్తగిరి పాదయాత్ర

రేగోడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బర్దిపూర్ దత్తగిరిమహరాజ్ 46వ వార్షిక అమర తిథి సందర్భంగా కొనసాగుతున్న పాదయాత్ర పల్లకీ సేవ బుధవారం రేగోడు మండలంలోని టీ లింగంపల్లి గ్రామం నుంచి బయలుదేరింది. భక్తులు భారీగా దర్శనం చేసుకున్నారు.

చెక్కుల పంపిణీ ఎప్పుడో..?

చిలప్‌చెడ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మూడునెలల క్రితం మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎప్పుడు పంపిణీ చేస్తారని బీజేపీ మండల నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల క్రితం మంజూరైన చెక్కులను పంపిణీ చేస్తామని తేదీ ఖరారు చేసి, ఎమ్మెల్యే సునీతారెడ్డి వస్తుందని ఆపడం ఎంతవరకు సమంజసమన్నారు.

23వ రోజుకు దీక్ష

నర్సాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం 23వ రోజుకు చేరింది. ఈ దీక్షలో మున్సిపల్ పరిధిలోని 12వ వార్డుకు చెందిన అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడరాజేందర్, కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ నగేష్, రవితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ, దుర్గమ్మ ఉత్సవాలు

నర్సాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ, దుర్గమాత ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ మాజీ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అనసూయఅశోక్‌గౌడ్ దంపతులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జోగిపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.47,090 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు. పట్టణంలోని బజాజ్ షోరూం ఎదురుగా ఉన్న శ్రీశైలం షట్టర్లలో పేకాట ఆడుతున్నారని వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు దాడిచేసి, ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.47,090 వేలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు.

శిశు గృహకు 'ఎల్ఐసీ' సామగ్రి అందజేత

సంగారెడ్డి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని శిశు గృహకు ఎల్ఐసీ సహకారంతో బుధవారం సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ శాఖాధిపతి మారుతిరావు మాట్లాడుతూ ప్రతి ఏటా సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శిశుగృహలోని చిన్న పిల్లల కోసం పాలపొడి డబ్బాలు, బియ్యం, డైపర్స్ అందజేస్తున్నామన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు 31వ తేదీవరకు గడువు

సంగారెడ్డి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్‌లో భాగంగా ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యాసంస్థల బలోపేతానికి కేరియర్ టెక్నాలజీ కృషి భేష్

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మౌలిక వసతులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కేరియర్ టెక్నాలజీ సంస్థ చేస్తున్న కృషి భేషుగ్గా ఉన్నదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి కొనియాడారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్‌ఎస్)లో విద్యార్థుల సౌకర్యార్థం బుధవారం కేరియర్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో మౌలిక వసతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పించేందుకు ప్రైవేటు సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రైవేటు సంస్థల తోడ్పాటు అందించడంతో ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని చెప్పారు. పాఠశాలలో నిర్మించిన టాయిలెట్స్, వాటర్ ట్యాంకర్, మంచినీటి కులాయిలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సైన్స్ ల్యాబ్‌ను కలెక్టర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, కేరియర్ టెక్నాలజీ సంస్థ అధినేత నందా లక్కిరాజు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, ఉపాధ్యాయులు మదన్‌గోపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు విజయేందర్‌రెడ్డి, రామప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలరహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దాలి

● అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ రాహుల్‌రాజ్



మహిళా అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలరహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దాలని, అందుకు సంబంధిత శాఖల సమన్వయం చాలా అవసరమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనకు సంఘటితంగా పోరాడాలన్నారు. బాలికలు అంటే చిన్నచూపు చూడడం మానేయాలన్నారు. ఆడ, మగ మధ్య వ్యత్యాసం ఉండకూడదన్నారు. వ్యాపార, వృత్తి, ఉపాధి రంగాల్లో మహిళల పాత్ర గణనీయమని, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకుట్టుకున్నాయి. అనంతరం వివిధశాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉత్తమ మహిళా ఉద్యోగులను ప్రశంసాపత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధశాఖల మహిళా అధికారులు సరస్వతి, విజయలక్ష్మి, శశికళ, నీలిమ, ఇందిరా పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం: చలపతిరావు


నేరడిగుంటలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ఇస్తున్న చలపతిరావు

జోగిపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని నేరడిగుంటలో.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మార్కింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. అందోలు మండలంలో నేరడిగుంట గ్రామాన్నే పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని, ఇక్కడ దరఖాస్తు చేసుకున్న అందరిలో అర్హులైన వారిని గుర్తించి ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, హౌజింగ్ డీఈ మల్లేశం, ఎంపీడీవో రాజేశ్, ఎంపీవో అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరాజ్ యాదవ్, నాయకులు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవలబుల్ పాఠశాలలకు బిల్లులు మంజూరు చేయండి


అఖిలేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి సభ్యులు

సంగారెడ్డి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవలబుల్ పాఠశాలలకు బిల్లులు మంజూరు చేయాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎస్సీ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో పరమేశంకు బుధవారం ఫోరం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు మంజూరు చేసి పాఠశాలలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కొన్నినెలలుగా ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో స్కూల్స్ యాజమాన్యాలు విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయడం లేదని, ఆహారం కూడా అరకొరగా వడ్డిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు రాజు, ఫోరం ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, సహ కార్యదర్శి పాండురంగం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా..

● చైర్మన్ యశ్వంత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్‌రెడ్డి

టేక్మాల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : టేక్మాల్ సొసైటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని, కానీ తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చైర్మన్ యశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన టేక్మాల్ సొసైటీ గోదాంలో మహాజన సభ బుధవరం నిర్వహించి, మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే తనపై అవినీతి, ఆరోపణలు చేశారని, అవి నిజమైతే బహిరంగంగానే తేల్చుకుందామని సవాల్ విసిరాడు. రైతులకు ఇబ్బందులు ఉన్నాయని బ్యాంక్, దుకాణ సముదాయ భవనం నిర్మించామని చెప్పారు. పదేళ్లలో సొసైటీని అభివృద్ధి చేశానే తప్ప అవినీతికి పాల్పడలేదన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటయ్య, శ్రీశైలం,కిషన్, నాయకులు వీరప్ప, ముక్తార్, సిద్ధయ్య, అడివప్ప, సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ


జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంజక్

జోగిపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పోలీస్‌స్టేషన్‌ఉ ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ, సిబ్బంది బ్యారక్ పరిశుభ్రతను, స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ప్రతీ కేసులో న్యాయమైన విచారణ జరిపి బాధితులకు అండగా ఉండాలన్నారు. ఉద్యోగరీత్యా కానీ, వ్యక్తిగతంగా కానీ ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఎస్‌ఐ పాండు పాల్గొన్నారు.

మూడు నెలలుగా అందని వేతనాలు


గుండ్లమాచునూర్‌లో గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామపంచాయతీ కార్మికులు బుధవారంవిధులు బహిష్కరించి నిరసనకు దిగారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆగ్రహ వ్యక్తం చేశారు. నెలల కొద్దీ వేతనాలు బకాయి పడడంతో ఇళ్లలోకి నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు నెలనెలకు చెల్లించే ప్రభుత్వం.. పంచాయతీ కార్మికులపై వివక్ష చూపడం ఏమిటని ప్రశ్నించారు. బకాయి వేతనాలు చెల్లించే వరకు విధుల్లో చేరేది లేదని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భీష్మించికూర్చున్నారు. గ్రామస్థులు జోక్యం చేసుకుని నచ్చజెప్పారు. అత్యవసర ఖర్చుల నిమిత్తం కొంత డబ్బును తాము సర్దుబాటు చేసి మీ వేతనాలు వచ్చాక తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి విధుల్లో చేరారు.

'నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలి'

హత్నూర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పారిశ్రామిక రంగాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా సీఎస్ఆర్ జనరల్ మేనేజర్ అవిలాష్ ద్వివేది తెలిపారు. హత్నూర ఆర్ ఐటీఐలో సెంటమ్ ఫౌండేషన్ సహకారంతో మహీంద్రా అండ్ మహీంద్రా ఆధ్వర్యంలో ఐటీఐ విద్యార్థులకు మూడునెలలుగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అసెంబ్లీ లైన్ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా హెడ్ గణేష్ డీజీఎం అడ్మిన్ సెక్యూరిటీ సీఎస్ఆర్ ప్రదీప్ గౌడ్, కార్పొరేట్ సీఎస్ఆర్‌బీ జీఎం మదన్‌రామ్, అడ్మిన్ సునీల్ సాదంగి, సెంటర్ ఫౌండేషన్ డైరెక్టర్ ధ్రువ్ మిట్టల్, సీనియర్ మేనేజర్ దర్శన్ సావంత్, ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, ట్రైనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్ట్


జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టైన మాజీ సర్పంచులు

సంగారెడ్డి/మనూరు/నాగల్‌గిద్ద, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ బుధవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో తట్టు నారాయణ, చిన్నపాటిల్, హబ్సీ రాజు, ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌రాజు తదితరులున్నారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని బుధవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను మనూరు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. నాగల్‌గిద్ద మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పండరి, విఠల్‌రావుపటేల్, అంజిరెడ్డి, నందుసింగ్‌లను నాగల్‌గిద్ద పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఖేడ్‌లో వీఆర్‌ఏలు..

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీని ముట్టడించేందుకు వీఆర్ఏలు యత్నిస్తున్నారనే సమాచారంతో బుధవారం ఉదయం నారాయణఖేడ్‌లో పోలీసులు పలువురు వీఆర్ఏలను ముందస్తుగా అరెస్టు చేశారు. వీఆర్ఏల సంఘం నాయకులు శంకర్, యాదయ్య, అల్లం, రాజు, తుకారం, చోటుమియాలను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలుపుకోవాలి

● మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ

సంగారెడ్డి/సంగారెడ్డి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాయిపల్లి రాంచందర్ పేర్కొన్నారు. మాదిగలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమైన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మందక్రిష్ణమాదిగ పిలుపుమేరకు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిరసన దీక్ష చేపట్టారు. మాదిగలను నమ్మించి వంచించే సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో అరుంధతి సంఘం నాయకులు జయరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు సుకుమార్ మాదిగ పాల్గొన్నారు.

చైర్మన్ పదవిని మాదిగలకే కేటాయించాలి

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగలకే కేటాయించాలని ఖేడ్ డివిజన్ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ అలిగే జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. చైర్మన్ పదవిని మాదిగలకే కేటాయించాలని ఎస్సీల వర్గీకరణ చట్టం వచ్చేవరకు ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్ మైదానంలో చేపట్టిన దీక్ష రెండోరోజు బుధవారం కొనసాగింది.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

తూప్రాన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అంధత్వ నియంత్రణ సంస్థ, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్ల అద్దాలు అందజేసినట్లు డివిజన్ నేత్ర వైద్యాధికారి వీర్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో స్కానింగ్ నిర్వహించి, తూప్రాన్, నర్సాపూర్ డివిజన్‌కు సంబంధించి నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఫిబ్రవరి 17 నుంచి మార్చి 8 వరకు నేత్రాధికారులు డాక్టర్ రాజేశ్, రవళి, వీర్‌కుమార్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు జరిపారు. అందులో 350 మందికి కంటి అద్దాలు అవసరం కాగా, మొదటి విడతగా వచ్చిన 182 అద్దాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేత్రాధికారి డాక్టర్ వీర్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ వెంకట్, డాక్టర్ సంగీత, ఫార్మసిస్టు రమేష్, ఏఎన్‌ఎం మమత పాల్గొన్నారు.

గీతంలో ఫొటోగ్రఫీపై ఆతిథ్య ఉపన్యాసం

పటాన్‌చెరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'ఒక చిత్రం వెయ్యి పదాలకు సమా నం' అయితే, దీనిని మరింత విస్తృతపరుస్తూ ఛాయాచిత్రకళలో 'నిజాన్ని వెతుక్కుం టూ..' అనే శీర్షికన, ఐఐటీ హైదరాబాదుకు చెందిన డాక్టర్ దీపక్ జాన్ మాథ్యూ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఛాయాచిత్రకళపై లోతైన అవగాహనను ఏర్పరచేలా సాగిన ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీలో వాస్తవికత అర్థం, దాని చారిత్రక పరిణా మం, ప్రామాణికత, ఫోటోగ్రఫీ, పెయింటింగ్ మధ్య పరస్పర చర్యను ఆయన వివరించారు. శతాబ్దాలుగా ఫోటోగ్రఫీ ఎలా మారిపోయిందో డాక్టర్ మాథ్యూ అన్వేషించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్‌ఎస్)లోని మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, అసోసియేషన్ ఆఫ్ డిజైనర్స్ ఇండియా, ఐఐటీ హైదరాబాద్‌లు సహకారం అందజేశాయి. అలాగే, జీఎస్ హెచ్‌ఎస్‌లోని లలిత, ప్రదర్శన కళల విభాగం కుండల తయారీపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించింది. కుండల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జీఎస్ హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జోస్, కార్యక్రమ సమన్వయకర్త డాక్ట ర్ వై.లలితా సింధూరి, కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఆదిశేషయ్య సాడే పాల్గొన్నారు.

ధర్మమే మనల్ని కాపాడుతుంది

● గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ మహరాజ్


గోపాలకాల కీర్తనలో భక్తులు

కల్హేర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మానవుడు నడిచిన ధర్మమే మనల్ని కాపాడుతుందని గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్‌మహరాజ్ అన్నారు. సిర్గాపూర్ మండలం అంతర్గాం గ్రామంలోని ఆశ్రమ ఆవరణం రుక్మిణీ పాండురంగ ఆలయంలో వారంరోజులపాటు జరిగిన సామూహిక గాథా పారాయణం, సంత్ తుకోబరాయ్ 375వ వైకుంఠ గమన మహోత్సవాల ముగింపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరణ్‌మహరాజ్ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విఠల్‌రావ్, రవిపటేల్, అంజన్న, జ్ఞానేశ్వర్, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

'ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి'

కంగ్టి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జాబ్‌కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఆర్డీవో బాల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చాప్టా.కెలో, కంగ్టి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. నిర్దిష్ట కొలతల ప్రకారం పనులు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందని సూచించారు. వందరోజుల పని పూర్తి చేసుకున్న కూలీలకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ధ్రువకుమార్, విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మాణికుమార్, ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి'

నారాయణఖేడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, నగర కార్యదర్శి శంకర్ కోరారు. బుధవారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేయడం కోసం నిధులను అవసరం మేరకు కేటాయించడమే కాకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గౌతాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

చిలప్‌చెడ్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎండాకాలం ఇంకా రాకముందే నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. ఎండాకాలం ప్రారంభంలోనే నీటి ఎద్దడి ఏర్పడితే మరి జోరు ఎండల్లో ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా తమ గల్లీకి నీరు సరఫరా చేయాలని కోరారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

జిన్నారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరారు. గడ్డపోతారంలో మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోనే ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్లు, నిర్మాణాలు చేపట్టారని మున్సిపల్ అధికారులకు బుధవారం తెలిపారు. కాగా అల్లీనగర్‌లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనగా.. ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని మాజీ వార్డు సభ్యుడు వీరేశంగౌడ్ తెలిపారు. మున్సిపల్ విలీన గ్రామం మాధారంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, మున్సిపల్ అధికారులు ఎవరు గ్రామంలో పర్యటించడం లేదని గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గణేష్ తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

చండీలో జోరుగా జూదం


జూదం ఆడుతున్న యువకులు

శివ్వంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పేకాట, బొమ్మా బొరుసు ఆటలు జోరుగా సాగుతున్నాయి. అదేవిధంగా గంజాయి తాగుతూ యువకుల పాడవుతున్నారని విశ్వసనీయ సమాచారం. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చెడు వ్యసనాల వైపు వెళ్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మండల పరిధిలోని చండీ గ్రామంలో మంగళవారం రాత్రి బొమ్మా బొరుసు ఆడుతూ 20 మంది యువకులు కనిపించారు. రాత్రి 11.30 గంటల వరకు బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తుండడంతో మద్యం సేవించి జూదం ఆడుతున్నట్లు స్థానికులు ఆరోపించారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట

సంగారెడ్డి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరుబాట నిర్వహిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఇళ్లలేని పేదలకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా తదితర హామీలను అధికారంలోకి వచ్చాక రేవంత్ సర్కార్ మర్చిపోయిందని ఎద్దేవా చేశారు.